


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# మేధకు పొలిమేర ఆదర్శాలకు వెండి అంచు
# శ్రీ శ్రీ
## ( 1963 జూన్ సినిమా రంగం నుంచీ పునర్ముద్రణ)




'మరో ప్రపంచం'తో ఆంధ్రదేశాన్ని ఉద్రూత లూగించి

"నలుగురు కలిసి అందరూ పొరువులు మరచి చేయాలి ఉమ్మిడి వ్యవసాయం" అంటూ ఉత్తేజ పరచిన మహా కవి శ్రీ శ్రీ .

గతంలో 'శ్రీ శ్రీ మార్కు పద్యాలనే వాడుడు' అని గర్వంగా చెప్పుకునే వాళ్ళం. 'మహా ప్రస్థానం' తర్వాత మనలని కదలించిన కవితా సంపుటి ఇంకొకటి రాలేదని యీ నాటికీ బాధపడే వాళ్ళు ఆంధ్రదేశం నిండా వున్నారు.

'ఏం ఎందుకు రాయడు?' అని అందరూ మూగగా ప్రశ్నిస్తూనే వున్నారు. ఇంత మదిని ఇలా 'బాధ పెట్టేస్తున్న' మహాకవి చిదానందుడిలా చిన్న నవ్వుతో మన ఆందోళననీ, ఆవేశాన్నీ అన్నిటినీ కొట్టిపారేస్తాడు. 'సినిమా పనులు' అంటాడు. నిజంగానే అలాంటప్పుడు సినిమా పనుల మీద సాహిత్యాభిమానులందరికీ కోపం రాక తప్పదు కదా?

శ్రీశ్రీ ఏనాడో సినిమా రంగ ప్రవేశం చేశాడు. కాని, తొలుత విశ్రాంతి ఎక్కువ వుండెడిది. ఘాటైన కవిత్వం రాసేవాడు. కానీ, ఈనాడు కొంచెం తక్కువగా వెయ్యి పాటలు రాసిన సినిమా కవి శ్రీ శ్రీ. ఒక్కొక్క పాట వెనుక వెచ్చించిన కాలం సులభంగా ఊహించుకోవచ్చు మనం.

ఎంత సినిమా కవి అయినా వ్యక్తి గతంగా 'మహాకవి' బిరుదాన్ని నిలుపుకో గల వ్యక్తిత్వం కలవాడు శ్రీశ్రీ. నిరాడంబరి, నిత్యాగ్నిహోత్రుడూ అయిన యీ మహా వ్యక్తిని చూడగానే గుర్తుపట్టవచ్చు. ఎదుటివాడు ఎంత సామాన్యుడైనా హృదయం విప్పి మాట్లాడతాడు. సామ్యావాది. మానవారాధకుడు. ఐశ్వర్యమదంగాని, జ్ఞాన దివాంధతగాని ఒంటబట్టని యీ మహావ్యక్తిని ఆంధ్రదేశం ప్రేమించింది. యీ నాటికీ ప్రేమిస్తూంది. ఇప్పటికీ మూగగా అడుగుతుంది 'మరో ప్రపంచం చవిచూసి వూరుకున్నావేం?' అని.

మహా రచయితలందరూ చాలామంది నేడీ రంగంలో చిన్నవారు. అందరిలోకీ ప్రత్యేకత వహించి, హిమాలయం లాగా ఉన్నతంగా కనబడతాడు శ్రీశ్రీ. యీ ఔన్నత్యం సులభంగా పూలబాట పయనంలాగా రాలేదు. కష్టాల కంచెలను దాటుకుంటూ, కష్టతరంగా పైకి వచ్చి న నిబ్బరుడు శ్రీ శ్రీ.

'కాలచక్రం' పేరు జ్ఞాపకం ఉందా? విడుదల నాడే ఆ పిక్చరు కాలగర్భంలో కలిసింది. అదే శ్రీశ్రీ పనిచేసిన తొలి చిత్రం. అంతకు ముందు 'నేనెక్కబోయిన బస్సు ఎనోసార్లు వదులుకున్నాను. మోజేతులెట్టి తోసుకుంటూ ముందుకు పోయేవారుంటారు కదా?" అంటాడీయన నవ్వుతూ. తరువాత 'మరో ప్రపంచం' మాంటో క్రిష్టో కథ. దీనిలో కపిల కాశీపతి, బందా మొదలైన ప్రముఖులున్నారు. దీనినీ ప్రజానీకం మన్నించ లేదు. బయలుదేరినట్టే బయలుదేరి ఆగిపోయిన రైలుబళ్ళు ఎన్నో అలాగే 'గాంధీ నగర్ ' అన్న ఒక చలన చిత్రానికి పాటలు రాశాడు శ్రీశ్రీ. దానికి సంభాషణలు చలంగారు రాశారట. 'దేశ దిమ్మరి' చిత్రం కూడా పురిట్లోనే సంధి కొట్టింది. రైలెక్కే ముందిలా తోసి వేయబడి మొట్టమొదటి సారిగా పూర్తిగా మాటలూ, పాటలూ రాసిన చిత్రం 'ఆహుతి'. ఇది దైవికమో ఏమో డబ్బింగు చిత్రం 'నీర్ ఔర్ నందా' అనే దానికి అనువాదం. ఇదీ విజయవంతం అయినది కాకపోయినా శ్రీశ్రీలో ఆశ మొలకెత్తించింది. అప్పట్లో మద్రాసులో వర్షాల కాటకం. ఎన్నో సంవత్సరాలుగా వానలు లేక యీ సినిమా విడుదలతో జడివానలు పట్టుకోవడం, గల్లా పెట్టెలు నిండకపోవడం జరిగింది.

తరవాత చలన చిత్ర పితామహులు శ్రీ హెచ్. యమ్.రెడ్డిగారి కొలువులో చేరడం జరిగింది. దరిదాపు అక్కడ ఆస్థాన కవిగా చలామణీ అవుతూ, అవసరాన్ని బట్టి పాటలూ, మాటలూ రాస్తూండేవాడు.

"నిర్దోషి, ప్రతిజ్ఞ" మొదలైన వాటికి పనిచేశాడు. మూనాస్ ఆ రోజుల్లో సృష్టించిన 'ప్రపంచం' కూడా శ్రీ శ్రీ సృష్టే.

యీ సంవత్సరాంతం వచ్చేసరికి శ్రీశ్రీ సినిమాలకని వేయి పాటలు రాసి ఉంటాడు. ఆ సంఖ్యను పురస్కరించుకుని, ఉత్సవం చేయాలన్న కుతూహలం వుంది శ్రీశ్రీకి.

శ్రీశ్రీ పూర్తిగా ఆశావాది. ఈయన చేసిన వాటికన్నా చేద్దామన్నవే ఎక్కువ. నిర్మాతగా ఓ కన్నడ చిత్రాన్ని తెలుగులోకి అనువదించారు.  అది ఆర్ధికంగా దెబ్బ తీసింది. అయినా నిర్మాత కావాలన్న కుతూహలం పోలేదు సరికదా, చాలా పథకాలు వేసుకుని వున్నారు. 'రుక్మిణీ కల్యాణం' తీయాలని కవి ఖడ్గ తిక్కనల జీవితాలను సమ్మిళితం చేసి ఒక రసవత్తర సృష్టి చేసి, అత్యాధునికంగా ఒక చలన చిత్రం తీయాలని యీయన కోరిక. 'ఆకలి మంటలు'  అనే ఒక సాంఘికానికి రూపం దిద్దాలని ఉత్సాహం వుంది.

శ్రీశ్రీ సరదాలూ, కోరికలూ, చర్యలూ కూడా గమ్మత్తుగా ఉండి ఉంటాయి. 'జగన్మోహిని' అన్న ఒక అనువాద చిత్రానికి ఉదయ నుంచి సాయంత్రంలోగా పది పాటలు రాసి ఓ.కే చేసిన రికార్డు హోల్డరు. (పూర్వంలో నిలువుటద్దం సైజులో 'మహా ప్రస్థానం' అచ్చు వేయాలి అనే వింత కోరిక ఉండేది శ్రీ శ్రీకి)

'పుట్టిల్లు' ఫ్లాప్ అయినా జమున నటి అయింది. అలాగే శ్రీశ్రీ పాట "పెంపుడు కొడుకు" చిత్రంలో "ఉన్న వాడికే అన్ని సుఖాలూ రయ్యో ఓరయ్యో" అనే దానితో రాజసులోచన నాట్యతార అయి కూర్చుంది ఆ రోజుల్లో. ఒక్క "మానవుడే మహానుభావుడు" అన్న గేయంతో అత్యుత్తమంగా నడిచింది "గాంధారీ గర్వభంగం" అనే అనువాద చిత్రం, శ్రీశ్రీ చెప్పినట్టు కలం వింటుంది. అన్యభాషా సంబంధం అయిన పాటను తెలుగులో 'తెలుగదే యిది' అనేలా రాయగల డబ్బింగు కవి శ్రీశ్రీ ఒక్కడే.

ఇప్పటికి ముప్పయి నలభై డబ్బింగు చిత్రాలకు సాహిత్యం పొదిగిన ఘనత శ్రీశ్రీది. వ్యక్తిగా, రచయితగా, కవిగా సహృదయుడు "మీరిన్ని పాటలు రాశారే. మీకేది యిష్టం?" అంటే, తడువుకోకుండా "తోడికోడళ్ళు"లోని 'నలుగురు కలిసి ...పొరుపులు మరచి చెయ్యాలి ఉమ్మడి వ్యవసాయం" అన్నది అంటాడు.

"కలకానిది" అన్న వెలుగు నీడల్లోని పాట మరొకటి...

"పెను చీకటి లోకం" అన్నది "మాంగల్య బలం"లోనిది. "కులగోత్రాలు"లో "మామయ్య మీసం" మీది పద్యం, "ఇద్దరు మిత్రులలో 'పాడవేల రాధికా', "ఆరాధన"లోని "నా హృదయంలో నిదురించే చెలీ"మొదలైన అనేక అమృత గుళికల్లాంటి పాటలు మహాకవి శ్రీశ్రీ రాసినవే.

శ్రీశ్రీ ది ఏకాగ్రతకు పెట్టింది పేరు. పుస్తకం, పేపర్లు కనిపిస్తే ఎక్కడున్నదీ మరిచిపోయి, వాటిలో మునిగిపోతాడు. విద్యాధికుడైన ఈ మహా వ్యక్తి కలం బలాన్ని సవాల్ చేసే అవకాశమే రావాలి గాని, వస్తే ఆంధ్రుల అదృష్టం పండిందన్నమాటే.

ఒకసారి మాటాడినా చూసినా శ్రీ శ్రీని మరిచిపోలేం.

Post your comments